క్లుప్తంగా

ఘనంగా షిరిడీసాయి మందిర వార్షికోత్సవం



సిరిపురంలో నిర్వహిస్తున్న సామూహిక సాయి సత్యవ్రతాలు

కరప: మండలం సిరిపురంలోని షిరిడీసాయి మందిరం 22వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చిక్కాల వీరవెంకటసత్యనారాయణ, సుబ్బారావు సోదరుల ఆధ్వర్యంలో అర్చకుడు కె.రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు జరిపించి గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు 10 వేల మందికి ప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, చిక్కాల అబ్బు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

- రూ.35 వేలు స్వాధీనం

కరప: మండలం గురజానాపల్లిలోని పేకాట శిబిరంపై శనివారం తెల్లవారుజామున పోలీసులు దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ. 35,010 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారు జామున 3 గంటలకు కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ సిబ్బందితో కలసి దాడిచేశారు. పోలీసులు రావడాన్ని గుర్తించిన ఇద్దరు నిందితులు పరారయ్యారు. అక్కడ ఉన్న ముగ్గురిని అరెస్టు చేశారు. 5 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విశాఖ వెళ్లి పింఛను అందజేత



దుర్గాప్రసాద్‌కు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్

కరప: నడకుదురు గ్రామానికి చెందిన కిడ్నీ రోగి గుండుపోగుల దుర్గాప్రసాద్ విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటూ బంధువుల ఇంటివద్ద ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి కె.బ్రహ్మానందం వెల్ఫేర్ అసిస్టెంట్ వై.అనిల్‌కుమార్‌ను శనివారం విశాఖపట్నం పంపించి అతనికి రూ. 10 వేల పింఛన్ అందజేశారు. తన పింఛన్ పోతుందేమోనని భయపడ్డామని, తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు అని తెలిపారు.

రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కాకినాడ సిటీ: జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏఎస్‌డీ మహిళా కళాశాలలో మహిళా సాధికార సదస్సు నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్యవక్తగా రంగరాయ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శైలజ ప్రసంగిస్తారన్నారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

కాకినాడ సిటీ: కేంద్ర బీజేపీ పాలకులు తాజాగా పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ముడిచమురు ధరలు తగ్గుతున్నా మన దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతూనే ఉన్నారని విమర్శించారు. ప్రైవేట్ ఆయిల్ కంపెనీల ప్రయోజనాలు తప్ప ఈ పాలకులకు సామాన్యుల గోడు పట్టడం లేదన్నారు. సీఐటీయూ నాయకులు చంద్రమళ్ల పద్మ, కె సత్తిరాజు, మలక వెంకటరమణ తదితరులతో పాటు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ భద్రతా దినోత్సవం

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం 50వ జాతీయ భద్రత దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత సైనిక ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో భద్రత దళాలు విపరీతమైన ప్రతికూల పరిస్థితుల్లో రాత్రనకా పగలనకా పనిచేస్తూ దేశ ప్రజలను ప్రశాంతంగా జీవించడానికి కృషి చేస్తున్నారన్నారు. వారి కృషిని గుర్తించడానికి ఏటా మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం కొంగోడులో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి శనివారం పర్యటించి, ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, ఆట్ల గోవిందరాజులు, బుంగా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిలపై కొరడా

- పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్
- రెడ్ నోటీసులు జారీ
- పట్టించకోకుంటే కఠిన చర్యలు



నగరపాలక సంస్థ కార్యాలయం

కాకినాడ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతుండడంతో ఆస్తి పన్ను, కుళాయి పన్ను వసూళ్లపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఓ వైపు మొండి బకాయిదారులపై కొరడా ఝుళిపించేందుకు సమాయత్తమవుతూనే ప్రస్తుత ఆర్థిక సంవత్సర బకాయిలు రాబట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించింది. నోటీసులను పట్టించుకోని వారిపై కఠిన చర్యల్లో భాగంగా రెడ్ నోటీసుల జారీతో పాటు కుళాయి కనెక్షన్లు తొలగించేందుకు సిబ్బంది సమాయత్తమవుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారులు పన్నులపై దృష్టిపెట్టారు.

రూ.39 కోట్లు వసూలు

ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావలసిన బకాయిలను మినహాయిస్తే ఏటా సుమారు రూ. 48 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించి 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు దాదాపు రూ.39 కోట్లు వసూలు చేయగలిగారు. రానున్న 25 రోజుల్లో మరో రూ.9 కోట్లు వసూలు చేయడం ద్వారా నూరుశాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించాలనే ఆలోచనతో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతో పోలిస్తే పన్నుల వసూళ్లలో కాకినాడ నాలుగో స్థానంలో ఉందని అధికారులు చెబుతున్నారు.

రెడ్ నోటీసులు సిద్ధం

మొండి బకాయిలు వసూలు చేసే క్రమంలో ప్రస్తుతం రెడ్ నోటీసులు జారీ చేసేందుకు నగరపాలక సంస్థ సిద్ధమవుతోంది. రూ.15 కోట్ల ప్రభుత్వ బకాయిలతో పాటు మరో రూ. 2.5 కోట్ల ఆస్తి పన్నులు మొండి బకాయిలుగా చూపిస్తున్నాయి. వీటిపై దృష్టిసారించిన కార్పొరేషన్ తొలుత రెడ్ నోటీసులు జారీ చేసి, అప్పటికీ స్పందించకపోతే కుళాయి కనెక్షన్లు తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే కుళాయి బకాయి పన్నులు పాత, కొత్త కలిపి రూ.12 కోట్లకు రూ.8 కోట్లు వసూలయ్యాయి. మరో రూ.4 కోట్లు వరకు వసూలు కావాల్సి ఉందని రెవెన్యూ వర్గాల సమాచారం. నగరంలోని 80 వేల అసెస్‌మెంట్లకు ఆస్తిపన్నులో 77 శాతం, కుళాయి పన్నుల్లో 45 శాతం వసూలు లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించినట్టు చెబుతున్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి



ఆస్తి పన్ను, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించాలి. నగర అభివృద్ధికి పన్నుల ఆదాయమే కీలకం. అందువల్ల ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలి. మార్చి చివరి నాటికి పన్నులు చెల్లించకపోతే ఆ తరువాత అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుంది.

– సీహెచ్ నాగనరసింహారావు, కమిషనర్, కాకినాడ

కలెక్టర్, జేసీలను కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీ



కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ శనివారం కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆమెను కలెక్టర్‌కు పరిచయం చేశారు. జేసీ ఇలాక్కియను కూడా ఆమె కలిసారు. వీరి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి నారాయణరావు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కాకినాడ లీగల్: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తులు సి.జానకి, వి.సాహితి అన్నారు. శనివారం స్థానిక పీఆర్ కళాశాలలో మహిళా దినోత్సవంలో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు జానకి, సాహితి మాట్లాడుతూ వివిధ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పీఠం కళా సేవ అభినందనీయం



దాడి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సేవాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు శాస్త్రి తదితరులు

కాకినాడ కల్చరల్: శాస్త్రి సేవా పీఠం చేస్తున్న కళా సేవ అభినందనీయమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం అన్నారు. స్థానిక రాజారామ్మోహన్‌రాయ్ వీధిలోని కాకినాడ పెన్షనర్స్ భవనం మొదటి అంతస్తులో కళాపీఠం ఆధ్వర్యంలో శాస్త్రి కళా ప్రాంగణం (సాహితీ, కళారంగాల ఐక్యవేదిక)ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవీఎస్ నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. ఔత్సాహిక కళాకారులకు మరింత ప్రోత్సాహం అందజేసేందుకు ఈ కళా ప్రాంగణం ఏర్పాటు చేసినట్టు పీఠం వ్యవస్థాపకుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి అన్నారు. వక్తలు పీఠం సేవలను కొనియాడారు. అనంతరం కళా రంగాలకు విశిష్ట సేవలు అందజేస్తున్న సీతారామరాజు స్మారక కళావేదిక వ్యవస్థాపకుడు పంపన దయానంద బాబును, వ్యక్తిత్వ వికాసం సంస్థ వ్యవస్థాపకులు అద్దేపల్లి ఉదయభాస్కర్‌ను, డీసీ, యూట్యూబ్ చానల్, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక వ్యవస్థాపకులు దాడి చంద్రశేఖర్‌లను సత్కరించి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి, తురగా సూర్యారావు, పద్మజావాణి, కాటంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ-అవనిగడ్డకు అల్ట్రా డీలక్స్

- రేపటి నుంచి ప్రారంభం
- ఆర్టీసీ డీఎం మనోహర్

కాకినాడ: కాకినాడ నుంచి అవనిగడ్డ వెళ్లేందుకు అల్ట్రా డీలక్స్ సర్వీసును ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని స్థానిక డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ శనివారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. కాకినాడ నుంచి యానాం, అమలాపురం, రాజోలు, నర్సాపురం, బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, చల్లపల్లి, మోపిదేవి మీదుగా అవనిగడ్డకు ఈ సర్వీస్ నడుస్తుందన్నారు. ఈ నెల ఆరో తేదీ ఉదయం నుంచి ఈ సర్వీస్ అమలులోకి వస్తుందన్నారు. ఉదయం 5 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరే సర్వీసు మధ్యాహ్నం సుమారు 12.30 గంటలకు అవనిగడ్డ చేరుతుందన్నారు. అలాగే అవనిగడ్డలో మధ్యాహ్నం 1.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు కాకినాడ చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసుకు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని, ఆన్‌లైన్‌లో కూడా టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు.

అన్నదాన సమాజం దుకాణాల స్వాధీనం



దుకాణాలను స్వాధీనం చేసుకుంటున్న దేవదాయశాఖ అధికారులు

బోట్‌క్లబ్: స్థానిక మసీదు సెంటర్ సమీపంలో 18 నెలలుగా లీజు చెల్లించని కోకనాడ అన్నదాన సమాజానికి చెందిన రెండు దుకాణాలను శనివారం దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా షాపులను గతంలో లీజు వేలం పాడుకున్న ఇద్దరు వ్యాపారులు సుమారు రూ.5 లక్షలు బాకీ పడ్డారు. దీంతో అధికారులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి వారి ఆదేశాల మేరకు దుకాణాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారుల బ్యాంకు గ్యారెంటీలు రూ.2.5లక్షల చొప్పున ఉన్నాయని, ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఈ షాపులకు త్వరలో లీజు వేలం నిర్వహిస్తామని కోకనాడ అన్నదాన సమాజం ఈఓ శివబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావు, దేవాదాయశాఖ కాకినాడ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, రెవిన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

- కమిషనర్ నాగనరసింహారావు
- ప్రత్యేక అధికారులతో సమీక్ష

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణంలో మరింత వేగం పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో నగరపాలక సంస్థ, హౌసింగ్ ప్రత్యేక అధికారులతో గృహనిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. కొమరగిరి లేఅవుట్‌లో పెద్ద ఎత్తున ఇళ్లు నిర్మిస్తున్నందున డిమాండ్‌కు తగ్గట్టు ఇటుకలు సరఫరా చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అక్కడ ఇటుకల పరిశ్రమ అందుబాటులో ఉన్నప్పటికీ డిమాండ్ మేరకు బ్రిక్ ఇండస్ట్రీలను సంప్రదించాలని సూచించారు. ఏ దశలోను నిర్మాణాలు మందగించకుండా చూడాలన్నారు. అలాగే లబ్ధిదారులైన స్వయం సహాయక సంఘాల సభ్యులు సుమారు 4వేల మందికి రూ.35 వేల బ్యాంకు లింకేజీ అందాల్సి ఉందని, దీనిపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఇంకా అగ్రిమెంట్లు చేసుకోని లబ్ధిదారులను స్వయంగా కలసి ఇంటి నిర్మాణ ప్రగతిని, భవిష్యత్‌లో ఆ ప్రాంతం మరో టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందబోతున్న అంశాన్ని వివరించి ప్రోత్సహించాలని సూచించారు. అలాగే కాంట్రాక్టర్ల బిల్లులు ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ ఈఈ గుప్త, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

మధ్వమత వైభవాన్ని చాటండి

సత్యాత్మతీర్థ స్వామిజీ



సత్యాత్మతీర్థ స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న మధ్వసభ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: మధ్వాచార్య మూల మహాసంస్థానం ఉత్తరాది మఠ పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రాత్రి కాకినాడ చేరుకున్నారు. స్వామిజీకి కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి, కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు, మధ్వ సభ్యులు పూర్ణకుంభంతో స్వామిజీకి స్వాగతం పలికారు. స్వామిజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మధ్వ సభ్యులు ప్రతి మధ్వ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. వాయిపుత్రుడైన ఆంజనేయ స్వామిని సేవించడం ద్వారా మధ్వమత వైభవాన్ని చాటాలన్నారు. మధ్వ మతానికి అందరూ అంకితమై గురువుల అనుగ్రహాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వామిజీ శిష్యులు కానుగోవి వాసుదేవాచార్, విజయసింహాచార్, మధ్వకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటిపై అలసత్వం వద్దు

- రబీలో ఒక్క ఎకరం కూడా ఎండకూడదు
- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయించాలి
- మండల సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశం



కరప మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ఒక్క ఎకరం కూడా ఎండనీయకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి, రబీని గట్టెక్కించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశించారు. ఇళ్ల స్థలాలిచ్చిన పట్టాదారులందరినీ చైతన్య పరచి మూడు వారాల్లో గృహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలుతీసుకోవాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన వివిధ శాఖల సమీక్షలో పలు సూచనలిచ్చారు. వంతులవారీ విధానం సాగునీటి సరఫరా అమలవుతోంద, ఉన్న వనరులతో అధికారులు సమన్వయంతో నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. మండల పరిధిలో 28 లే అవుట్లలో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం సాగడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులు లబ్ధిదారులను చైతన్యపరచి కాలనీల్లో సదుపాయాలు, రుణ సౌకర్యాల కల్పన తదితర విషయాలపై అవగాహన కల్పించాలని కోరారు. తాను సైతం లబ్ధిదారులను కలుస్తానని ఎమ్మెల్యే వివరించారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడుతూ మండల పరిధిలో 12,737 మందికి జాబ్ కార్డులుంటే 8,500 కార్డుదారులే పనిచేయడంపై ప్రశ్నించారు. అందరికీ పని కల్పించి చెరువుల్లో , పంట, మురుగు కాలువల్లో పూడికతీత చేపట్టాలని సూచించారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కర్రె స్వప్న శాఖలవారీగా సమీక్ష జరిపారు. ఎంపఓగా ఏవీ రాజేష్ మాట్లాడుతూ 96 శాతం ఈ–క్రాప్ నమోదు చేశామన్నారు. మండలవైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ కుక్క కాటు కేసులకు అవసరమైన ఏఆర్వీ యూనిట్లు ఉన్నాయన్నారు. మండల ఇంజనీరింగ్ అధికారి శైలజ, ఉపాధిపథకం ఏపీఓ ఈ.వెంకటరమణ, ఇరిగేషన్ ఏఈఈ బీవీవీ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈఈ శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తదితరులు వారి శాఖల అంశాలను వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ బొమ్మిడి వీర్రాఘవులు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



మద్యం సీసాలను ప్రదర్శించిన ప్రత్యేకాధికారి శ్రీనివాస్

కాకినాడ క్రైం: కాకినాడ రూరల్ పండూరు జంక్షన్ సమీపంలో యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.9 లక్షలు విలువైన 1776 మద్యం సీసాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బృందం స్వాధీనం చేసుకుంది. యానాంకు చెందిన నక్కల శ్రీనివాస్, పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామానికి చెందిన బొందు జోగిరాజు, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన వల్లూరి వీరబాబు, పలివెల మణికంఠలను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తెలిపారు.

పదవులు అలంకారం కాకూడదు

- ప్రజలకు సేవ చేసేలా ఉండాలి
- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బషీర్



రెహ్మాన్‌ఖాన్, అబ్దుల్ బషీరుద్దీన్‌లను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాకినాడ: పదవులు అలంకారప్రాయం కాకూడదని, ప్రజలకు సేవ చేసేలా ఉండాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వక్ఫ్‌బోర్డు నూతన కమిటీ సమావేశం స్థానిక సీరత్ కమిటీలో జరిగింది. చైర్మన్ రెహ్మాన్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సఫీ సభ్యులను సభకు పరిచయం చేశారు. బషీరుద్దీన్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి నూతన వక్ఫ్ కమిటీ కష్టించి పనిచేయాలని సూచించారు. మైనార్టీల కోసం సీఎం జగన్, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఎన్నో చర్యలు తీసుకున్నారని, ఎన్నో నిధులు విడుదల చేశారన్నారు. రెహ్మాన్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాంతాల్లో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని, వీటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా చైర్మన్ రెహ్మాన్‌ఖాన్, డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్‌లను సత్కరించారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా మొయినుద్దీన్, కార్యదర్శి అబ్దుల్ కరీమ్ సాహెబ్, సంయుక్త కార్యదర్శి షేక్ సయ్యద్‌బాబ్జీ పాల్గొన్నారు.

సంధికాలపు సతమతం



సామర్లకోటలో దాదాపు నిర్మానుష్యంగా ఉన్న ఫ్లైఓవర్

- మార్చిలోనే మండుతున్న ఎండలు
- తెల్లవారు జామున పొగ మంచు
- మధ్యాహ్నం విలవిల.. రాత్రికి గజగజ
- అల్లాడి పోతున్న ప్రజానీకం

సామర్లకోట: శీతాకాలం వెళ్తున్న, వేసవి వస్తున్న సంధికాలంలో రుతుచక్రం నడుస్తోంది. మార్చి నెల ప్రారంభంలోనే మధ్యాహ్న భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మరోవైపు రాత్రి వేళ శీతాకాలపు హిమపాతం నడి రుతువులా గజగజ వణికిస్తోంది. ఇదిలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఇంకెత వేసవి తాపాన్ని ఎదుర్కోవాలో అని ప్రజలు భయపడుతున్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి 8 గంటల వరకు దట్టమైన పొగ మంచు కురియగా 10 గంటల నుంచి భానుడు తన ప్రభావాన్ని చూపాడు. దాంతో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి 9 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్, ఏప్రిల్ మూడు నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. తీవ్రమైన ఎండల్లో పిల్లలు పరీక్షలు ఎలా రాస్తారా అని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఎండ వేడి తాళలేక ఫ్లైఓవర్ ఫుట్‌పాత్‌పైనే ట్రాఫిక్ కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

డిజిటల్ సేవలు విస్తృతం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

కాకినాడ రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా డిజిటల్ సేవలను విస్తృతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి కోరారు. డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు, సచివాలయాలు, వార్డు డిజిటల్ అసిస్టెంట్లకు శనివారం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. డిజిటల్ అసిస్టెంట్లు తమకు కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. ఎంపీడీవోలు విజయభాస్కర్ (పెదపూడి), డీఎల్ఎస్ శర్మ (గొల్లప్రోలు), భాస్కరరావు (యు.కొత్తపల్లి), శ్రీనివాస్ (కాకినాడ రూరల్), ఇందిరాదేవి (కాజులూరు), అనుపమ (తాళ్లరేవు) పాల్గొన్నారు.

18 ఏళ్ల లోపు వివాహం నేరం

కాకినాడ రూరల్: అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ల లోపు వివాహం చేయడం నేరమని జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. శేషాద్రి నగర్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పఢావోలో భాగంగా అవగాహన కార్యక్రమం జరిగింది.

8న ఎముకలు, కీళ్ల నొప్పులకు ఉచిత వైద్య శిబిరం

కాకినాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎముకలు, కీళ్ల నొప్పులకు సంబంధించి ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని సెవెన్ స్టార్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ సత్తి వెంకటరెడ్డి చెప్పారు. ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 20వ తేదీ వరకు మెయిన్ రోడ్ లోని తమ హాస్పిటల్ ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎముకల సాంద్రత నిర్ధారణ, కాల్షియం పరీక్ష, సూపర్ స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వెంకటరెడ్డి కోరారు. ఉచిత పరీక్షల కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఇందుకోసం 7386666888, 0884 –2388888 నంబర్లలో సంప్రదించవచ్చునన్నారు.